
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.5, కనిష్ఠం 20.6



5

కామారెడ్డి
జిల్లా వార్తలు

శనివారం 2 మార్చి 2024

బరంగేడ్డిలో ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బీర్కూర్, మార్చి 1: బీర్కూర్ మండలం బరంగేడ్డి మంజీరా నది నుంచి గత మూడు రోజులుగా ఇసుక అక్రమ రవాణా జోరుగా కొనసాగుతోంది. ఇదిలా ఉండగా శుక్రవారం బరంగేడ్డి మంజీరా నది నుంచి ట్రాక్టర్లలో ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు బరంగేడ్డిలో కాపు కాచి ఒక ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. అనంతరం ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

బీఆర్‌ఎస్‌కు బిగ్ షాక్



బీజేపీ సభ్యత్వం తీసుకుంటున్న ఎంపీ బీబీ పాటిల్

- ఎంపీ బీబీ పాటిల్ బీఆర్ఎస్‌కు రాజీనామా
- వెనువెంటనే బీజేపీలో చేరిన పాటిల్
- బీఆర్ఎస్‌లో గుర్తింపులేకపోవడమే రాజీనామాకు కారణం
- పాటిల్‌కు బీజేపీ ఎంపీ టికెట్ ఇస్తుందో లేదో చూడాలి
- జిల్లాలో బీఆర్ఎస్‌కు దెబ్బమీద దెబ్బ
- పార్టీని వీడుతున్న ప్రజాప్రతినిధులు, పలువురు ముఖ్యనేతలు
- కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ నుంచి భారీగా వలసలు
- ఇటీవల బీఆర్ఎస్ కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు కాంగ్రెస్‌లో చేరిక
- వలసలను నిలువరించలేకపోతున్న బీఆర్ఎస్
- అయోమయంలో గులాబీ క్యాడర్

కామారెడ్డి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌కు బిగ్‌షాక్ తగిలింది. పార్టీ పరంగా రెండు పర్యాయాలుగా గెలుపొందిన జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ బీఆర్ఎస్‌ను వీడారు. ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు మాజీ సీఎం కేసీఆర్‌కు శుక్రవారం ఎంపీ బీబీ పాటిల్ లేఖ రాశారు. రాజీనామా చేసిన వెనువెంటనే ఢిల్లీలో పాటిల్ బీజేపీలో చేరడం గమనార్హం. అయితే వచ్చే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలోనే మరోసారి ఎంపీగా బరిలో ఉండేందుకు బీఆర్ఎస్‌ను వీడినట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్‌లో ఎంపీ పాటిల్‌కు తగిన గుర్తింపు లేని కారణంతోనే ఆ పార్టీని వీడారని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ పరంగా బరిలో ఉంటే సొంతపార్టీ నేతలే మద్దతు తెలిపే అవకాశం లేదని భావించి పార్టీకి రాజీనామా చేసినట్లు ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. ఎంపీ పాటిల్ బీఆర్ఎస్‌ను వీడడంతో ఆ పార్టీ నేతలు అయోమయానికి గురవుతున్నారు. రోజురోజుకూ బీఆర్ఎస్ నుంచి వలసలు పెరుగుతున్నాయని పార్టీ అధిష్ఠానం సైతం వలసలను నిల్వరించలేకపోతుందని శ్రేణులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కాలంలో బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు ఆ పార్టీని వీడి కాంగ్రెస్, బీజేపీలో చేరుతున్నారు. దీంతో బీఆర్ఎస్ రోజురోజుకూ బలహీన పడుతోంది.

బీజేపీలో చేరిన ఎంపీ బీబీ పాటిల్

బీఆర్ఎస్ పార్టీకి చెందిన జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ ఎట్టకేలకు బీజేపీలో చేరారు. గత కొన్ని రోజులుగా పాటిల్ బీఆర్ఎస్ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మరోసారి జహీరాబాద్ ఎంపీ టికెట్‌కై బీబీ పాటిల్ ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తే గెలిచే అవకాశాలు లేవని సొంత పార్టీ నుంచి నాయ కులే మద్దతు ఉండదని భావించిన ఎంపీ ఆ పార్టీని వీడాలని నిర్ణయించుకున్నారు. మరోవైపు ఆయన అనుచరులు సైతం బీఆర్ఎస్‌ను వీడాలని బీజేపీలో చేరాలంటూ ఒత్తిడి చేస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో ఎంపీ బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. ఢిల్లీలో బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర బీజేపీ ఇన్‌చార్జ్ తరుణ్‌చుగ్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఎంపీ బీబీ పాటిల్ బీజేపీ కండువా కప్పుకుని పార్టీ ప్రాథమిక సభ్యత్వం తీసుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారాన్ని కోల్పోవడం జిల్లాలో ఒకే ఒక ఎమ్మెల్యే సీటు గెలువడం ఆ పార్టీ శ్రేణులను మరింత నిరుత్సాహానికి గురిచేసింది. ఇదే క్రమంలో బీబీ పాటిల్ లాంటి ముఖ్య ప్రజాప్రతినిధి పార్టీని వీడడం బీఆర్ఎస్‌కు మరింత కోలుకోలేని దెబ్బ.

పాటిల్‌కు ఎంపీ టికెట్ ఇచ్చేనా?

జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మరోసారి ఎంపీగా పోటీ చేసేందుకు బీజేపీలో చేరినట్లు తెలుస్తోంది. అయితే పాటిల్ జహీరాబాద్ ఎంపీ టికెట్‌ను బీజేపీ అధిష్ఠానం నుంచి ఆశించినట్లు సమాచారం. కానీ జహీరాబాద్ ఎంపీ టికెట్‌ను పాటిల్‌కు ఇచ్చేందుకు అధిష్ఠానం విముఖత చూపుతున్నట్లు బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో పాటిల్ బీజేపీలోనే ఎందుకు చేరారని క్యాడర్‌లోను, ఆయన అనుచర వర్గాల్లోనూ చర్చ సాగుతోంది. జహీరాబాద్ ఎంపీ టికెట్ కాకుంటే మహారాష్ట్ర లేకుంటే కర్ణాటకలో ఏదో ఒక చోట ఎంపీ టికెట్ ఇవ్వాలని బీజేపీ అధిష్ఠానాన్ని కోరినట్లు సమాచారం. బీబీ పాటిల్ జుక్కల్ నియోజకవర్గంలోని మద్నూర్ మండలం సిర్పూర్ సొంత గ్రామం. అయితే మహారాష్ట్రలోని నాందేడ్‌కు బార్డర్ కావడంతో పాటిల్‌కు అక్కడ సత్స సంబంధాలు ఉన్నాయి. అదేవిధంగా పాటిల్ సతీమణిది సొంత ఊరు నాందేడ్. ఈ నేపథ్యంలో బీజేపీ నుంచి నాందేడ్ ఎంపీ టికెట్‌ను బీబీ పాటిల్ ఆశిస్తున్నట్లు ఆయన అనుచర వర్గం చెబుతోంది. అయితే బీజేపీ పాటిల్‌కు ఎంపీ టికెట్ ఎక్కడ ఇస్తుందో వేచి చూడాలి.

ఖాళీ అవుతున్న కారు


మలిదశ తెలంగాణ ఉద్యమ సమయం నుంచి బీఆర్ఎస్‌కు కంచుకోటగా ఉన్న కామారెడ్డి జిల్లాలో పరిస్థితులు రోజురోజుకూ మారిపోతోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓడిపోవడంతో చాలా మంది నేతలు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండడంతో వలసలు జోరందుకున్నాయి. ప్రధానంగా జిల్లాలో కారు ఖాళీ అవుతోంది. కారు దిగుతున్న నేతలం కాంగ్రెస్, బీజేపీ గూటికి చేరుతున్నారు. ఇటీవల కాలంలో కామారెడ్డి, బాన్సువాడ మున్సిపాలిటీల్లోని పలువురు కౌన్సిలర్‌లు, సీనియర్ నాయకులు పార్టీని వీడుతూ కాంగ్రెస్‌లో చేరారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసి విజయం సాధించాలనే ఆరాటంతో ఉన్న వారు బీఆర్ఎస్‌ను వీడుతున్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు సీనియర్ లీడర్లు పార్టీని వీడుతున్నప్పటికీ ఆ పార్టీ నాయకత్వం నిల్వరించలేకపోతోంది. దీంతో గులాబీ శ్రేణుల్లో అయోమయం నెలకొంటుంది. బీఆర్ఎస్ బలం సైతం తగ్గుతోంది.

క్యూ కడుతున్న బీఆర్ఎస్ నేతలు

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండడంతో వలసలు జోరందుకున్నాయి. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ నుంచి పలువురు ప్రజాప్రతినిధులు, సీనియర్ నేతలు, నాయకులు, కార్యకర్తలు వరుసగా కాంగ్రెస్, బీజేపీలోకి క్యూ కడు తున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బీఆర్ ఎస్సే రెండు సార్లు విజయం సాధించింది. అయితే రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ఎలాగైన జహీరాబాద్‌పై జెండా ఎగురవేయాలని పట్టుదలతో ఉంది. దీంతో బీఆర్ఎస్ నుంచి వలసలను ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్‌ను బలహీన పరచడంతో పాటు తన పార్టీ బలాన్ని పెంచుకునే ప్రయత్నం చేస్తోంది. కామారెడ్డి మున్సిపల్ పరిధిలో సుమారు 15 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్‌లు కాంగ్రెస్‌లో చేరారు. దోమకొండ జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, ఎంపీపీ గాల్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ ఇందుప్రియ, భిక్కనూర్ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నరసింహారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ భూమయ్యతో పాటు మాచారెడ్డి, దోమకొండ, బీబీపేట, రాజంపేట మండలాలకు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. బాన్సువాడకు కంచుకోటైన పోచారం ఇలాకాలోనూ ఒకేసారి నలుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్‌లు ఇటీవలే కాంగ్రెస్‌లో చేరారు. వీరితో పాటు పలువురు ముఖ్యనేతలు సైతం కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోనూ లింగంపేట జడ్పీటీసీ శ్రీలత, ఎల్లారెడ్డి ఎంపీపీ మాధవి, గాంధారి, తాడ్వాయి, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాలకు చెందిన పలువురు నేతలు కాంగ్రెస్‌లో చేరారు. జుక్కల్‌లోను బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఇలా జిల్లాలో బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నాయకులు ఒక్కొక్కరు పార్టీని వీడుతుండడంతో బీఆర్ఎస్ క్యాడర్ అయోమయానికి గురవుతోంది.



బీజేపీ కండువా కప్పుకుంటున్న పాటిల్



ఇంటర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్

- సెల్ఫ్ సెంటర్లలో పెద్ద ఎత్తున మాస్ కాపీయింగ్
- పరీక్షలు రాస్తున్న వారికి పలువురు ప్రభుత్వ లెక్చరర్ల సహాయం
- సదాశివనగర్‌లో ఇద్దరు లెక్చరర్ల అరెస్ట్, రిమాండ్
- ఆయా మండలాల్లోని కళాశాలలపైన అనుమానాలు
- పరీక్షల నిర్వహణలో ఇంటర్ అధికారుల నిర్లక్ష్యం

కామారెడ్డి టౌన్/సదాశివనగర్, మార్చి 1: ఇంటర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరుగుతుందనే ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. జిల్లాలోని 37 కళాశాలల్లో ఇంటర్ పరీక్షలు కొనసాగుతుండగా చాలా చోట్ల పరీక్షలను తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పర్యవేక్షణ అధికారులుగా సీఎస్‌లను, డీవోలను, సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించిన వారు పేరుకే పని చేస్తున్నారే తప్ప వారి విధులపై దృష్టి సారించడం లేదని విద్యార్థి సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా సెల్ఫ్ సెంటర్లలో మాస్ కాపీయింగ్‌కు ఎక్కువగా పాల్పడుతున్నారని, ఆయా చోట్ల విధులు నిర్వహించే సిబ్బందికి విద్యార్థుల నుంచి వసూలు చేసిన డబ్బుల నుంచి విందులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆయా మండలాల్లో ఎక్కువ మొత్తంలో పెద్ద ఎత్తున జరుగుతుందని సమాచారం. పరీక్షలు రాస్తున్న వారికి పలువురు ప్రభుత్వ లెక్చరర్‌లే సహాయం అందిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అందుకు ఉదాహరణే సదాశివనగర్‌లో పట్టుబడిన ఇద్దరు లెక్చరర్ల పనితీరు. ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు చిట్టీలు అందించేందుకు ప్రయత్నం చేయగా పోలీసులు గుర్తించి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

సదాశివనగర్‌లో ఇద్దరు లెక్చరర్ల రిమాండ్

సదాశివనగర్ మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు ప్రయత్నించిన ఇద్దరు లెక్చరర్‌లు ఎండీ ఇశ్రాత్, బి.రంజిత్‌లను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. పరీక్ష జరుగుతున్న సమయంలో కళాశాల వెనుక భాగంలో బ్యాగ్ తో తిరుగుతున్న ఇశ్రాత్ అనే లెక్చరర్‌ను పోలీసులు గమనించి ప్రశ్నించగా బ్యాగును కిందపడేసి పారిపోయేందుకు ప్రయత్నం చేయడంతో అతనిని వెంబడించి పట్టుకున్నారు. బ్యాగులో పరిశీలించగా చిట్టీలు కనిపించడంతో పోలీసు స్టేషన్‌కు తరలించా రు. అక్కడ విచారణ చేపట్టగా కళాశాలలో రిలీవర్‌గా పని చేస్తున్న రంజిత్ అనే లెక్చరర్‌కు చిట్టీలను అందిస్తున్నాడని తేలింది. దీంతో రంజిత్‌ను సైతం గురువారం రాత్రి అరెస్ట్ చేశారు. శుక్రవారం ఇరువురిని కోర్టులో హాజరుప రచగా ఇద్దరికి న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు సీఐ సంతోష్ తెలిపారు.

సెల్ఫ్ సెంటర్‌లలో మాస్ కాపీయింగ్

సెల్ఫ్ సెంటర్‌లలో పెద్ద ఎత్తున కాపీయింగ్ చేస్తున్నారని ఆరోపణలు జిల్లాలోని ఆయా మండలాల్లో పెద్ద ఎత్తున సెల్ఫ్ సెంటర్‌లు ఏర్పాటు చేయడంతో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల్లోని ఆయా ప్రభుత్వ కళాశాలల్లోనే ఈ తంతు ఎక్కువగా జరుగుతుందని తెలుస్తోంది. పరీక్ష నిర్వహణ జరిగేప్పుడు పర్యవేక్షణకు ప్రతీ సెంటర్‌లో సిట్టింగ్‌స్క్వాడ్‌లు ఉంటారని వారితో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసిన సదాశివనగర్ మండలంలో ఇద్దరు ప్రభుత్వ లెక్చరర్‌లే ఏ విధంగా చిట్టీలు అందించేందుకు సిద్ధమవుతారని ఈ కాపీయింగ్‌లో ఆయా అధికారుల సహాయ సహకారాలు ఉంటాయని పూర్తిస్థాయి విచారణ జరిపితే మరిన్ని విషయాలు బయటకు వచ్చే అవకాశాలు ఉంటాయనే అభిప్రాయాలు విద్యార్థి సంఘ నాయకుల నుంచి వినిపి స్తోంది. పరీక్ష నిర్వహణపై చూసీచూడనట్లు ఉంటే పరీక్షల అనంతరం విందు, మందు అందించేందుకు ఆయా కళాశాలల సిబ్బంది సిద్ధపడుతున్నారని అందుకు విద్యార్థుల నుంచి పెద్దఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

యథేచ్ఛగా జిరాక్స్ సెంటర్ల ఓపెన్

పరీక్షల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని ఒకటికి రెండు సార్లు కలెక్టర్ ఇంటర్ అధికారులకు, సిబ్బందికి సమావేశం ఏర్పాటు చేసి సూచిం చినా అధికారులు మాత్రం ఎప్పటిలాగే పెడచెవిన పెడుతూ వచ్చారని తెలుస్తోంది. మాస్ కాపీయింగ్ జరిగే అవకాశాలు ఉంటాయని ప్రతీచోట పరీక్షలు ముగిసే వరకు జిరాక్స్ సెంటర్‌లను మూసి ఉంచేలా చూడాలని చెబుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో యథేచ్ఛగా జిరాక్స్ సెంటర్‌లను ఓపెన్ చేసే ఉంచుతున్నారని తెలుస్తోంది. పరీక్ష పత్రంను విద్యార్థులకు అందించగానే రిలీవర్‌లుగా ఉంటున్న లెక్చరర్‌లు పేపర్‌ను బయట ఉన్న ఇతర సిబ్బంది లేదంటే లెక్చరర్‌లకు అందిస్తుండడంతో అందులోని ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలను జిరాక్స్ చేయిస్తూ విద్యార్థులకు అందిస్తున్నారని తెలుస్తోంది.

ఆరు గ్యారెంటీలను షరతులు లేకుండా అమలు చేయాలి

- కొత్త రేషన్ కార్డులు ఇవ్వకుండా ప్రతీ స్కీంకు రేషన్‌కార్డు లింకులు
- ఉచిత బస్సు అని పెట్టి ఆ నష్టం పూడ్చేందుకు ఆర్టీసీ ఆస్తులు లీజ్‌కా?
- ప్రజలను మభ్యపెట్టే పథకాలు తీసుకువచ్చిన రాష్ట్ర ప్రభుత్వం
- ప్రజల శ్రేయస్సుకు పథకాలు తీసుకువస్తున్న కేంద్ర ప్రభుత్వం
- విజయ సంకల్ప యాత్రలో ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

కామారెడ్డి టౌన్/బాన్సువాడ టౌన్ / గాంధారి, మార్చి 1: రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలను షరతులు లేకుండా అమలు చేయాలని ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి అన్నారు. శుక్రవారం కామారెడ్డి మండలం గర్గుల్ నుంచి జిల్లా కేంద్రంలోని జేపీఎన్ రోడ్డు వరకు విజయసంకల్ప యాత్రలో భాగంగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అలాగే గాంధారి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జేపీఎన్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలను మభ్యపెట్టే పథకాలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకువస్తుందని అన్నారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం అంటూనే ఆ నష్టం పూడ్చేందుకు ఆర్టీసీ ఆస్తులను లీజ్‌కు ఇచ్చి అసలుకే ఎసరు తెస్తుందని అన్నారు. గృహజ్యోతి పథకం అమలుకు 200 యూనిట్లు ఉచిత కరెంటు అంటూనే ఒక యూనిట్ ఎక్కువ వాడినా మొత్తం బిల్లును చెల్లించాలని కొర్రీలు పెడుతున్నారని అన్నారు. అసలు కొత్త రేషన్ కార్డులు ఇవ్వకుండా ప్రతీ పథకానికి రేషన్‌కార్డులు లింకులు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. 10 ఏళ్లగా రేషన్‌కార్డులు లేవని అసలు రేషన్‌కార్డులే ఇవ్వకుండా ఈ పథకాలను అమలు చేసేందుకు రేషన్‌కార్డులు తప్పనిసరి అని పెట్టడం విడ్డూరంగా ఉందని ఇది ప్రజలను మభ్యపెట్టినట్లు కాదా అని అన్నారు. ప్రజలను మభ్యపెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం పథకాలు తీసుకువస్తే ప్రజాశ్రేయస్సు కోసం కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం పథకాలను తీసుకువస్తుందని అన్నారు. వైకుంఠ ధామాలు, స్వచ్ఛ భారత్, పల్లెలు, పట్టణాల్లో సెంట్రల్ లైటింగ్, ప్రకృతి వనాలు, జనధన్ ఖాతా, ఉజ్వల జ్యోతి, స్ట్రీట్ వెండర్‌లకు ఆర్థిక సహాయం ఇలా ఒకటేమిటి అనేక రకాలుగా ప్రధాని నరేంద్రమోదీ జనరంజక పాలనను అందిస్తున్నాడని అన్నారు. ఈ పరిపాలననే మళ్లీ గెలుపునకు అడుగులు వేస్తుందని 400 సీట్లతో మళ్లీ బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోనూ అన్ని సీట్లను గెలిచేందుకు సిద్ధంగా ఉన్నామని అసదుద్దిన్ ఓవైసీ సీటు సైతం బీజేపీ ఖాతాలో పడనుందని అన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలో మేడిగడ్డ, అన్నారం అంటూ ఒకరి మీద ఒకరు విమర్శలు చేసుకుంటూ ప్రజలను మాయ చేస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, నాయకులు మైపాల్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, జైపాల్ రెడ్డి, నీలం చిన్నరాజులు, శ్రీకాంత్, భరత్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

పథకాల అమలులో కొర్రీలు

బాన్సువాడ టౌన్: ఎన్నికల సమయంలో ప్రజలకు మోసపూరితమైన వాగ్దానాలు, మాయ మాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, తీరా అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారెంటీల అమలుకు ఆపసోపాలు పడుతోందని కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. శుక్రవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పథకాల అమలుకు కొర్రీలు పెడుతోందని, తాజాగా గృహజ్యోతి పథకానికి రేషన్‌కార్డు కావాలని చెబుతోందన్నారు.

ఇంటర్, పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

● రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

కామారెడ్డి టౌన్, మార్చి 1: ప్రశాంత వాతావరణంలో ఇంటర్, పదో తరగతి వార్షిక పరీక్షలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి డీజీపీ రవిగుప్తా, రాష్ట్రస్థాయి ఉన్నత అధికారులతో కలిసి ఇంటర్, 10వ తరగతి పరీక్షల నిర్వహణ, ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాటుపై జిల్లా కలెక్టర్‌లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాంతికుమారి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయని, మార్చి 19 వరకు ఇంటర్ పరీక్షలు, మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు 10వ తరగతి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. దీని కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేసి ప్రశాంత వాతావరణంలో సజావుగా పరీక్షలు జరిగేలా అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సీఎస్ ఆదేశించారు. పరీక్ష కేంద్రాలలోకి ఎవరు సెల్‌ఫోన్‌లు తీసుకుని వెళ్లడానికి వీలులేదని, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని కట్టుదిట్టంగా సజావుగా పరీక్షలు నిర్వహించాలని సీఎస్ తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించి లీకేజీలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విధుల నుంచి తొలగించడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదవుతాయని అన్నారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకునే విధంగా అవసరమైన రూట్లలో బస్సు సర్వీసులు నడపాలని, కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, ఎక్కడ చిన్న పొరపాటు కూడా జరగకుండా సజావుగా పరీక్ష నిర్వహించాలని సీఎస్ సూచించారు. ప్రభుత్వం మరో 2 గ్యారెంటీ పథకాల అమలుకు శ్రీకారం చుట్టిందని, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా పథకాలను అమలు చేస్తుందన్నారు. ప్రతీ ఒక్క అర్హుడికి ప్రభుత్వ గ్యారెంటీ పథకాలు అందేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ప్రతీ మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో అదేవిధంగా మున్సిపాలిటీలో అవసరమైన మేర ప్రజాపాలన సేవ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మాట్లాడుతూ ఇంటర్ మీడియట్ పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరగడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎస్పీ సింధూశర్మ మాట్లాడుతూ సదాశివనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాల్ ప్రాక్టీస్‌కు ప్రయత్నం చేసిన ఇద్దరు జూనియర్ లెక్చరర్లపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. పూర్తిస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పంచాయతీ గ్రామీణ అభివృద్ధి ప్రిన్సిపాల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, జడ్పీ సీఈవో చందర్, డీఐఈవో షేక్‌సలాం, డీఈఓ రాజు, డీపీవో శ్రీనివాస్‌రావు, విద్యుత్ ఈఈ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న సందీప్‌కుమార్ సుల్తానియా, కలెక్టర్, అధికారులు

ఉపాధి కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

కమ్మర్‌పల్లి, మార్చి1: పని ప్రదేశంలో ఉపాధి కూలీలకు టెంట్లు, తాగు నీరు, మెడికల్ కిట్ల సదుపాయాలు కల్పించాలని కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజ శ్రీనివాస్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండంలోని నాగాపూర్ గ్రామశివారులో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. పనుల్లో తక్కువ కూలీలు ఉండడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. అందుకు గల కారణాలపై ఆరా తీశారు. ప్రతీరోజు కనీసం వంద మంది కూలీలు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ఫీల్డు అసిస్టెంట్ రాజేశ్వర్‌ను, పంచాయతీ కార్యదర్శి సంధ్యలను ఆదేశించారు. అయితే మస్టర్‌లో పేర్లు ఉన్న కూలీలు మాత్రమే క్షేత్రస్థాలో ఉపాది పనులకు హాజరుకావాలని సూచించారు. పేర్లు లేనివారు హాజరు కాకుండా చూసుకోవాలని సూచించారు. గ్రామంలో ఫ్రైడే, డ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికీ తిరుగుతూ పర్యావరణం పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆయన వెంట అంగన్‌వాడి టీచర్లు, ఆశావర్కర్‌లు ఉన్నారు.

కమ్మర్‌పల్లిలో బోనాల ఊరేగింపు

కమ్మర్‌పల్లి, మార్చి1: కమ్మర్‌పల్లి మండలకేంద్రంలో శుక్రవారం గ్రామ రజక సంఘం ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు నిర్వహించారు. బోనాల ఊరేగింపు గ్రామ ప్రధాన వీధులు, జాతీయరహదారి గుండా కుడిగుంట చెరువు ప్రాంతంలో నూతనంగా నిర్మించిన రజకుల ఆరాధ్యదైవం మండేశ్వర స్వామి ఆలయానికి చేరుకుంది. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి బోనాలు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు ఆవుట్ల బాజన్న, కోశాధికారి సుంకెట నర్సయ్య, సుంకెట గంగాధర్, బాజన్న, సుంకెట శ్రీనివాస్, రవి, దశరత్, సుంకెట రమేష్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



బోనాలను ఊరేగిస్తున్న మహిళలు



దేగాంలో ఇంటింటికీ వెళ్లి వివరాలు తెలుసుకుంటున్న డీఎంఅండ్‌హెచ్‌వో

క్షయ రహిత జిల్లాగా మారుస్తాం

● జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుదర్శనం

ఆర్మూర్‌రూరల్, మార్చి1: టీబీని పూర్తిస్థాయిలో నిర్మూలించే దిశగా పని చేస్తున్నామని, త్వరలోనే నిజామాబాద్‌ను క్షయ రహిత జిల్లాగా మారుస్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుదర్శనం అన్నారు. శుక్రవారం ఆర్మూర్ మండలం దేగాం గ్రామంలో టీబీ ముక్త్ గ్రామపంచాయతీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ జిల్లాలోని 530 గ్రామ పంచాయతీలో 19 గ్రామపంచాయతీలను క్షయరహిత గ్రామాలుగా ఎంపిక చేశామన్నారు. ఈ గ్రామాల్లోని డేట వెరిఫికేషన్ ఏర్పాటు చేసిన బృందం శుక్రవారం దేగాం గ్రామాన్ని సందర్శించింది. గ్రామంలో ఉనన డెటాను తనిఖీ చేసి టీబీ శాంపిల్స్‌ను సేకరించిన ఇంటింటికీ వెళ్లి వివరాలను అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి చక్రవర్తి తరుణ్, డాక్టర్ కిశోర్‌కుమార్, జిల్లా టీబీ కోఆర్డినేటర్ రవి, శ్రీరాం, సుధాకర్, నాగరాజు, ఉమా మహేష్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

దేశం అభివృద్ధి చెందాలంటే వర్సిటీలదే కీలక పాత్ర

• టీయూలో వికసిత్ భారత్‌లో విద్యారంగం పాత్రపై సెమినార్

డిచ్‌పల్లి, మార్చి1: భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా ఎదగలంటే వర్సిటీలు కీలకపాత్ర పోషించాల్సిన అవసరం ఉందని అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ (ఏబీఆర్ఎస్ఎం) జాతీయ ఉపాధ్యక్షురాలు డా.కల్పన ప్రవీణ్ పాండె అన్నారు. శుక్రవారం డిచ్‌పల్లి తెలంగాణ యూనివర్సిటీలో ఏబీఆర్ఎస్ఎం ఆధ్వర్యంలో వికాసిత్ భారత్‌లో విద్యారంగం పాత్ర అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌కు కల్పన ప్రవీణ్ పాండె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశ పరిశోధకులు ప్రయోగాలు చేసి 2047లో వరకు భారత దేశం అభివృద్ధి చెందిన దేశంగా ఎదగడానికి కృషి చేయలన్నారు. ఈ సదస్సులో గౌరవ అతిథిగా పాల్గొని కీలక ఉపన్యాసం చేసిన ఏబీఆర్ఎస్ఎం ఆల్ ఇండియా జాయింట్ ఆర్గనైజేషన్ జాయింట్ సెక్రటరీ గుంత లక్ష్మణ్ మాట్లాడుతూ దేశీయ టెక్నాలజీ అభివృద్ధి చేసి దేశ ఆత్మ నిర్భరతకు పాటు పడాలని అధ్యాపకులు పరిశోధకులకు పిలుపునిచ్చారు. భారతదేశ సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో అపూర్వమైన ప్రతిభ చూపి ముందంజలో ఉందన్నారు. పునరుత్పాదక ఇంధనాల అభివృద్ధికి పాటుపడుతూ మౌలిక వసతుల సదుపాయల కల్పనలో అభివృద్ధి సాధిస్తూ దేశం ప్రపంచస్థాయిలో బలమైనదేశంగా అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. దేశంలో ప్రతీ పౌరుడు, విద్యార్థి తానే సైనికుడిగా పనిచేస్తూ దేశ సురక్షిత అభివృద్ధికి పాటు పడాలని కోరారు. ఆత్మనిర్భర భారత్ నుంచి వికసిత్ భారత్‌కు కృషి చేస్తూ భారత్ తన విశ్వ గురువు తిరిగి అందుకోవడానికి సమిష్టి కృషి చేయాలని అన్నారు. అనంతరం ఇంగ్లీష్ అండ్ ఫారన్ లాంగ్వేజెస్ సహాయ ఆచార్యులు డా.కంకట రాజరాం మాట్లాడుతూ దేశం తలసరి ఆదాయం జీవన ప్రమాణాలు విద్య, వైద్యరంగంలో అభివృద్ధి సాధిస్తూ వికసిత్ భారత్‌గా అవతరించలన్నారు. ఈ దిశగా వర్సిటీలు పరిశోధన కేంద్రాలుగా ఇంక్యూబేషన్, స్టాటప్ కేంద్రాలుగా ఎదగాలని అప్పుడే వికసిత్ భారత్ సాధ్యమవుతుందని తెలిపారు. వర్సిటీ ప్రిన్సిపాల్ ప్రొ.ఆరతి మాట్లాడుతూ టెక్నాలజీ పెంపు ద్వారా మానవ వనరుల అభివృద్ధి ద్వారా వికసిత్ భారత్ దిశగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. సెమినార్ సమన్వయకర్తలు డా.వాసం చంద్రశేఖర్, డా.ఎం సత్యానారాయణ, డా.బోయపాటి శీరిష, వ్యవహరించారు. కార్యక్రమంలో ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదయ్య, సీనియర్ ఆచార్యులు అంజనేయులు డీన్ రాంబాబు, సంపత్‌కుమార్, తదితరులు ఉన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న డా.కల్పన ప్రవీణ్ పాండె


మాట్లాడుతున్న గుంత లక్ష్మణ్

మా గ్రామంలో సెల్‌టవర్ వద్దు

• గోలి లింగాల్ గ్రామస్థుల ఆందోళన
• టవర్ ఏర్పాటు కోసం తీసిన గుంతను పూడ్చేసిన గ్రామస్థులు

నాగిరెడ్డి పేట, మార్చి1: మండలంలోని గోలిలింగాల గ్రామంలో సెల్‌టవర్‌ను ఏర్పాటును నిరసిస్తూ గ్రామస్థులు శుక్రవారం ఆందోళనకు దిగారు. సెల్ టవర్ ఏర్పాటు కోసం గ్రామం వద్ద తవ్విన గుంతలను గ్రామస్థులంతా కలిసి పూడ్చేశారు. గ్రామ తాజా మాజీ సర్పంచ్ మురళి, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గోలి లింగాల్ గ్రామంలో ఇప్పటికే ఒక జియో సెల్‌టవర్ ఉందని, ప్రస్తుతం గ్రామంలో ఎయిర్‌టెల్ వారు సెల్‌టవర్‌ను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. కొన్ని నెలల క్రితమే గ్రామ పంచాయతీ ద్వారా గ్రామంలో గ్రామసభ నిర్వహించి గ్రామంలో ఎలాంటి సెల్‌టవర్ ఏర్పాటు చేయొద్దంటూ గ్రామస్థులంతా తీర్మానం చేశారన్నారు. సెల్‌టవర్ ఏర్పాటు కోసం పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతి ఇవ్వలేదన్నారు. గ్రామంలో సెల్‌టవర్‌ల ఏర్పాటుతో వాటి రేడియేషన్లతో పిల్లలు, వృద్ధులు, గర్భిణీల తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ఇప్పటికే గ్రామంలో పలువురు పక్షవాతంతో బాధపడుతున్నట్లు తెలిపారు. సెల్‌టవర్ వద్దంటూ ప్రజావాణిలో ఫిర్యాదు చేశామని తెలిపారు. సెల్‌టవర్ ఏర్పాటు విషయమై గ్రామస్థులంతా మూకుమ్మడిగా వ్యతిరేకిస్తూ, గ్రామస్థుల అభిప్రాయాన్ని ఏ మాత్రం పట్టించుకోకుండా సెల్‌టవర్ ఏర్పాటు కోసం సంబంధిత వ్యక్తులు గుంతను తీసేసినట్లు వారు తెలిపారు.

• ఫిర్యాదుపై అధికారి విచారణ

గోలిలింగాల్ గ్రామంలో సెల్‌టవర్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ గ్రామస్థులు ఇటీవల జిల్లా కేంద్రంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ప్రజావాణి ఫిర్యాదుపై జిల్లా ఉన్నతాధికారులు గ్రామంలో విచారణ జరపాలని మండల పంచాయతీ అధికారికి శ్రీనివాస్‌ను ఆదేశించారు. దీంతో ఎంపీవో శ్రీనివాస్ గ్రామంలో శుక్రవారం విచారణ జరిపారు. గ్రామస్థులతో ఆయన సమావేశమై గ్రామస్థులందరి అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. గ్రామంలో సెల్‌టవర్ ఏర్పాటు చేయొద్దంటూ సెల్‌టవర్ ఏర్పాటు విషయంలో గ్రామస్థులంతా వ్యతిరేకించారు.దీంతో గ్రామస్థులందరి అభిప్రాయాన్ని జిల్లా పంచాయతీ అధికారికి నివేదిక సమర్పిస్తానని శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మురళి, పంచాయితీ కార్యదర్శులు గంగాధర్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.


గుంతలను పూడ్చుతున్న గ్రామస్థులు


పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఐఈవో

పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఐఈవో

కోటగిరి, మార్చి1: కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రఘురాజ్ తనిఖీ చేశారు. విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా ఇన్విజిలేటర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు అసౌకర్యాలు కలగకుండా మౌలిక వసతులు కల్పించామన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షకు 251 మంది విద్యార్థులను గాను 248 మంది విద్యార్థులు హాజరు కాగా ముగ్గురు గైర్హాజరయ్యారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అనిల్ ఉన్నారు.

• ఇంటర్ పరీక్షలో ఒకరి డిబార్

నవీపేట: మండల కేంద్రంలోని మోడల్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలలో శుక్రవారం ఒకరు డిబార్ అయినట్లు అధికారులు తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షలలో భాగంగా శుక్రవారం మొదటి సంవత్సరం ఇంగ్లీష్ మీడియం పేపర్ నిర్వహించగా 408 మంది విద్యార్థులకు 390 మంది పరీక్షలకు హాజరయ్యారని అధికారులు పేర్కొన్నారు.

తాగునీటి ఇబ్బందులు కలగకుండా

ప్రణాళికలు రూపొందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

బోధన్ రూరల్, మార్చి 1: మండలంలోని అన్ని గ్రామాల్లో వేసవికాలం దృష్ట్యా తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని బోధన్ ఎంపీడీవో వెంకటేష్ జాదవ్ అన్నారు. శుక్రవారం బోధన్ మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రత్యేక అధికారులు, పంచాయితీ కార్యదర్శులు పర్యటించి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకోవాలని, తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించి గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీవో మధుకర్, మండల పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

'జిల్లా అభివృద్ధిని విస్మరించి

పసుపు ధరపైనే ఎంపీ మాట్లాడటం అవివేకం'


మాట్లాడుతున్న కాటిపల్లి నగేశ్‌రెడ్డి

డిచ్‌పల్లి,మార్చి1: ఎంపీ ధర్మపురి అర్వింద్ జిల్లా అభివృద్ధిని విస్మరించి కేవలం పసుపు ధరపై గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదమని, ఐదేళ్లకాలంలో జిల్లా అభివృద్ధికి చిల్లిగవ్వ కేటాయించిన అర్వింద్, ఆర్వోబీ నిర్మాణానికి నిధులు మంజూరీలో జాప్యం చేశాడని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటిపల్లి నగేశ్‌రెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు నిజామాబాద్ మార్కెట్‌లో పసుపునకు రూ.17,250 మద్దతు ధర కల్పించిందని గుర్తుచేశారు. మహారాష్ట్రలోని సాం గ్లీ పసుపు మార్కెట్‌కు అప్పటి కలెక్టర్, రైతు ప్రతినిధుల బృందాన్ని మద్దతు ధరకు తీసుకెళ్లారని గుర్తుచేశారు. గడిచిన 10ఏళ్ల కాలంలో నాటి ఎంపీ, ప్రస్తుత ఎమ్మెల్సీ కవిత, ఎంపీ అర్వింద్ డిచ్‌పల్లిలో పుట్‌ఓవర్ వం తెన నిర్మిస్తామని చెప్పి తప్పించుకొని తిరిగారని విమర్శించారు. జిల్లా కేంద్రంలో తక్షణమే పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు కంచెట్టి గంగాధర్, రాంచందర్ గౌడ్, గురడి నర్సారెడ్డి, పులివెంకటేశ్వర్, న్యాస రాజేశ్వర్, డాక్టర్ షాదుల్ల, మురళి, పెద్దోళ్ల శ్రీను, గంగారం, ఇబ్రహీం, పాల్గొన్నారు.

నాబార్డు నిధులతో

కల్యాణ మండపం నిర్మించాలని తీర్మానం

నవీపేట, మార్చి1: మండలంలోని బినోల సొసైటీకి చెందిన స్థలంలో నాబార్డు నిధులతో నూతనంగా కల్యాణ మండపం నిర్మించాలని శుక్రవారం సంఘం పాలకవర్గం సమావేశంలో తీర్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ హన్మాండ్లు మాట్లాడుతూ నాబార్డుకు చెందిన రూ.కోటి వ్యయంతో కల్యాణ మండపం నిర్మాణానికి తీర్మానం చేసినట్లు తెలిపారు. నూతనంగా నిర్మించిన సొసైటీ భవనంలో సేవింగ్ కౌంటర్ ఏర్పాటు చేయాలని, బంగారు ఆభరణాలపై రుణాలను అందించాలని తీర్మానం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ బాబర్, కార్యదర్శి రమేష్, పలువురు డైరెక్టర్లు పాల్గొన్నారు.

పొతంగల్‌లో వృద్ధురాలి అదృశ్యం

కోటగిరి, మార్చి1: పొతంగల్ మండల కేంద్రానికి చెందిన పోశవ్వ అనే 65 ఏళ్ల వృద్ధురాలు అదృశ్యమైనట్లు ఎస్సై సందీప్ తెలిపారు. పోశవ్వ గ్రామంలో ఒంటరిగా నివసించేదని పేర్కొన్నారు. గతనెల 25వ తేదీ నుంచి కనిపించడం లేదని ఫిర్యాదు రాగా ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8712659878 నెంబర్‌కు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

టీయూలో కొనసాగుతున్న క్రికెట్ పోటీలు

డిచ్‌పల్లి, మార్చి1: తెలంగాణ యూనివర్సిటీలో క్రికెట్ టోర్నమెంట్ 5వ రోజు కొనసాగింది. సెకండ్ సెమీ ఫైనల్ మ్యాచ్ వర్సిటీ పీజీ టీంతో కామారెడ్డి సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల టీం తలపడగా టీయూ పీజీ టీం, టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొని 141 పరుగులు సాధించి జీడీసీ కామారెడ్డి టీంపై గెలుపొంది ఫైనల్‌కు చేరినట్లు వర్సిటీ స్పోర్ట్స్ డైరెక్టర్ బాల కిషన్ తెలిపారు. ఈ టోర్నీ ఆర్గనైజింగ్ సెక్రటరి బీఆర్ నేతా జూనియర్ అసిస్టెంట్ నరేశ్ పాల్గొన్నారు.

గోవూరు వాసికి రాష్ట్రస్థాయిలో ఏడో ర్యాంకు

మోస్రా, మార్చి1: తెలంగాణ గురుకుల జూనియర్ లెక్చరర్ ఫలితాలలో మండలంలోని గోవూర్ గ్రామానికి చెందిన సుంకే అరవింద్ కుమార్ రాష్ట్రస్థాయిలో ఏడో ర్యాంకు సాధించారు. పీజీటీ, టీజీటీ ఉద్యోగాలను సైతం అరవింద్ సాధించడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఉస్మానియాలో అరవింద్ పీజీ పూర్తిచేశారు. అరవింద్‌కుమార్ మూడు ఉద్యోగాలకు ఎంపిక కావడంపై తల్లిదండ్రులు సుంకే సుబ్బయ్య, పుష్పలతో పాటు గ్రామస్థులు హర్షం వ్యక్తంచేశారు.

నేడు డిచ్‌పల్లిలో

గృహజ్యోతిని ప్రారంభించనున్న రూరల్ ఎమ్మెల్యే

డిచ్‌పల్లి, మార్చి1: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో భాగంగా అమలు చేయనున్న గృహజ్యోతి పథకం శనివారం (నేడు) డిచ్‌పల్లి మండల కేంద్రంలోని నడిపల్లి పంచాయతీలో రూరల్ ఎమ్మెల్యే డా.రేకులపల్లి భూపతిరెడ్డి ప్రారంభించనున్నారని మాజీ కోఆప్షన్ మెంబర్, కాంగ్రెస్ ప్రతినిధి శాంసన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

ఆర్మూర్‌రూరల్, మార్చి1: మండలంలోని చేపూర్‌లో మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్‌లను శుక్రవారం ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో రవికుమార్ ఆవిష్కరించారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఐదురోజులపాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈనెల 5న అగ్గిస్వామి మహారాజ్‌చే ఆశీర్వద తీర్థప్రసాదాలు, 6న కుంకుమార్చన, 7న గణపతిపూజ, పుణ్యాహవచనం, స్వామివారి ఊరేగింపు, నగరేడప్పు కళాబృందం వారిచే ప్రదర్శన, 8న శివపార్వతుల కళ్యాణోత్సవం, 9న అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వీడీసీ అధ్యక్షుడు రేక్కల గంగారెడ్డి, కోశాధికారి దాసరి నాగరాజులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బద్దంరాజు, సురేష్‌రుక్మాజీ, మాజీఎంపీటీసీ జన్నెపల్లి గంగాధర్, మాజీసర్పంచ్ కుస్తపురం గంగారెడ్డి, శ్రీకాంత్, చరణ్, లింగాగౌడ్, శాంతికుమార్, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

ఆర్మూర్‌రూరల్, మార్చి1: ఆర్మూర్ పట్టణంలోని నటరాజ నృత్యనికేతన్ విద్యార్థినీలు శుక్రవారం మామిడిపల్లిలోని అపురూప వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రదర్శించిన నృత్యప్రదర్శనను అందరినీ అలరించాయి. వేంకటేశ్వరస్వామి పుష్కర బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని నటరాజ నృత్యనికేతన్ విద్యార్థులకు ప్రత్యేక నృత్య ప్రదర్శనను ఏర్పాటు చేసినట్టు నాట్యగురువు బాశెట్టి మృణాళిని తెలిపారు. చక్కని నృత్యాలు, అభినయాలతో ఆకట్టుకున్న విద్యార్థినీలకు దేవస్థానం కమిటీ సభ్యులు, విజయ్ విద్యాసంస్థల అధినేత్రి అమృతలత ప్రశంస పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నటరాజ నృత్యనికేతన్ వ్యవస్థాపకులు మాడవేటి నారాయణ, విజయ్ విద్యసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

జాతీయ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో

గురుకుల విద్యార్థులకు బంగారు పతకాలు


క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ గోదావరి

డిచ్‌పల్లి, మార్చి1: ఈ నెల 21నుంచి 25 వరకు బీహార్‌లోని పాట్నాలో జరిగిన 41వ జాతీయ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఫైనల్ మ్యాచ్‌లో కేరళజట్టుపై తెలంగాణ రాష్ట్ర జట్టు 10-9 పరుగుల తేడాతో విజయం సాధించడంతో సాంఘిక సంక్షేమ పాఠశాల సుద్దపల్లి క్రీడాకారులు గోక సాత్విక, గోకశ్రవిక కీలక పాత్ర పోషించి బంగారు పతకాలు అందుకున్నట్లు ప్రిన్సిపాల్ గోదావరి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఇద్దరు క్రీడకారులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ దీప్తి వాణి, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ వనిత, ఫిజికల్ డైరెక్టర్‌లత, మౌనిక, అకాడమీక్ కోచ్ మౌనిక పాల్గొన్నారు.

ఎంఎడ్ 3వ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతం

డిచ్‌పల్లి, మార్చి1: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని ఎంఎడ్ రెగ్యూలర్ 3వ సెమిస్టర్ పరీక్షలు 3వ రోజు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం జరిగిన పరీక్షకు 36మంది విద్యార్థులకు గాను 35 మంది పరీక్షకు హాజరయ్యారని, ఒకరు గైర్హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంట చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

• పీజీ ఇంటిగ్రెటెడ్ పరీక్షలు ప్రశాంతం

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల పీజీ 1వ సెమిస్టర్ ఎంఏ, ఎంకాం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంఎస్సీ, ఎంబీఏ, ఎంసీఏ, 5ఏళ్ల ఇంటిగ్రెటెడ్ కోర్సులు ఏపీఈ, ఐపీసీహెచ్,ఐఎంబీఏ, 7వ సెమిస్టర్ రెగ్యూలర్ పరీక్షలు 5వ రోజు ముగిసాయి. శుక్రవారం జరిగిన పరీక్షకు 1,283 మంది విద్యార్థులకు గాను 1205 విద్యార్థులు హాజరయ్యారు. 78 మంది గైర్హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంట చంద్రశేఖర్ తెలిపారు. ఈ పీజీ పరీక్షలు వర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, భిక్కనూరు సౌత్ క్యాంపస్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గిరిరాజ్ కళాశాల, కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ, బాన్సువాడ ప్రభుత్వ డిగ్రీ, ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ, బోధన్ డిగ్రీ ప్రభుత్వ కళాశాలలో ఈ పరీక్షలు జరుగుతున్నాయని


ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు

బోధన్ రూరల్, మార్చి1: పట్టణంలోని నడి ఊరు చావిడి వద్ద నూతన హనుమాన్ ఆలయ విగ్రహప్రతిష్ఠాపనలో భాగంగా రెండోరోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేకపూజలు నిర్వహించారు. శుక్రవారం రెండోరోజు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు దంపతులు పాల్గొన్నారు. పాడి పంటలు చల్లగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బాగారెడ్డి మాట్లాడుతూ విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమానికి జగద్గురు శంకరాచార్య, హంపీ విరూపాక్ష, విద్యారణ్య భారతి స్వామి మహా సంస్థానం పీఠాధిపతి హాజరుకానున్నారని పేర్కొన్నారు. విగ్రహప్రతిష్ఠాపన సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు, వివిధ కుల సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి

బోధన్‌రూరల్, మార్చి1: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ విజయవంతం చేయాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ విద్య అన్నారు. ఆదివారం ఉదయం 6గంటలకు అన్నిచోట్ల పల్స్‌పోలియో చుక్కల కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. బోధన్ డివిజన్‌లోని కేంద్రాల పరిధిలో ఉన్న 37, 950 మంది ఐదేళ్ల లోపు పిల్లలకు తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలను వేయాలన్నారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ నిర్మలతో పాటు తదితరులు ఉన్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

బోధన్‌రూరల్, మార్చి1: ఎడపల్లి మండల కేంద్రంలో రైలు ఢీకొని ఓ యువకుడు మృతిచెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. నిజామాబాద్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన శేఖ్ సుభాన్ (30) అనే యువకుడు కూలీ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. నయాబాద్ ప్రాంతానికి వెళ్లి 11:30 తిరిగి వస్తుండగా చూసుకోకుండా జామా మసీదు దగ్గర పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర అసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

నవీపేటలో ట్రైనీ ఐఏఎస్ అధికారిణి పర్యటన


మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న అధికారిణి

నవీపేట, మార్చి1: మండల కేంద్రంలో శుక్రవారం ట్రైనీ ఐఏఎస్ అధికారిణి కిరణ్మయి పర్యటించారు. మండల కేంద్రంలోని లింగమయ్య గుట్ట వద్ద జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నర్సరీని పరిశీలించారు. అనంతరం రైతు వేదిక భవనంలో జరిగిన మహిళా సంఘాల సభ్యులతో ఆమె మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల నిర్వహణ, పొదుపు, బ్యాంకురుణాలను పొందే విధానం, రికవరీ, స్వయం ఉపాధి వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నవీపేట గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సాయా గౌడ్, ఐకేపీ డీపీఎం నీలిమా, ఎంపీడీవో నాగనాథ్, ఎంపీవో రామకృష్ణ, మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు ఉషారాణి, ఏపీఎం భూమేష్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి రవీందర్ నాయక్ తదితరులున్నారు.

అమరులకు నివాళి

బోధన్ రూరల్, మార్చి1: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం ప్రాణాలు అర్పించిన మాదిగ అమరవీరులకు జోహార్లు అంటూ శుక్రవారం అంబేడ్కర్‌చౌరస్తాలో అమరుల చిత్రపటాలకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంసీపీ జిల్లా సీనియర్ నాయకులు డల్ల సురేష్ మహజన్, లక్ష్మీగారి భూమయ్య మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఏర్పడి 30 ఏళ్లవుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా చేస్తున్నాయని అన్నారు. ఎస్సీలలో వర్గీకరణ లేక వైద్య, విద్యా, ఉద్యోగరంగాల్లో మాదిగ, మాదిగ ఉపకులాలు నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు బి.సాయిలు, తాడెం అబ్బయ్య, గంగాధర్, గైని రవి, తదితరులున్నారు.


అంబేడ్కర్ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న దృశ్యం

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎల్‌డీఎం, ఆర్‌బీఐ ఏజీఎం

• ఆర్‌బీఐ ఏజీఎం అనిల్ కుమార్

డిచ్‌పల్లి, మార్చి1: ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ నేరాలు అధికమవుతున్నాయని, ప్రతీఒక్కరు సైబర్‌నేరాలపై జాగ్రత్త పడాలని ఆర్‌బీఐ ఏజీఎం అనిల్ కుమార్, ఎల్‌డీఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా నడిపల్లి శాఖ ఆధ్వర్యంలో జరిగిన కేంద్ర ప్రభుత్వ జన సురక్షిత పథకాలు పీఎంజేజేబీఐ, పీఎంఎస్‌బీవై వాటిపై అవగహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన సేవాలను అందజేయాలని టీజీబీ రీజినయల్ మేనేజర్ నవీన్‌కుమార్, అన్నారు. ఈ సందర్భంగా పీఎంజేజేబీవై, ఎస్‌బీవై లబ్ధిదారులకు రూ.2లక్షల విలువల గల చెక్కులు వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఎఫ్ఐసీ కంట్రోలర్ మురళి మోహన్, బ్రాంచ్ మేనేజర్ పద్మ, ఖాతాదారులు, తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే లక్ష్యాలను చేరుకోవచ్చు

• ఐఆర్ఎస్ అధికారి శేషు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారి

రెంజల్, మార్చి 1: విద్యార్థులు పట్టుదలతో చదివితే తమ లక్ష్యాలను చేరుకోవచ్చని ఇండియన్ రెవెన్యూ సర్వీస్ అధికారి శేషు అన్నారు. శుక్రవారం మండలంలోని నీలా జిల్లా పరిషత్ పాఠశాలలో 9, 10వ తరగతి విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. తాను చదివిన చదువు, అనుభవాలను వివరిస్తూ విద్యార్థులను చైతన్యపర్చారు. పేదరికం చదువుకు అడ్డుకాదని, తెలివితో అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని అన్నారు. తాను కూడా మారుమూల ప్రాంతమైన సాలూరకు చెందిన వాడినని, ఢిల్లీలో 2016 బ్యాచ్ మెకానికల్ ఇంజనీరింగ్‌గా విద్యాభ్యాసం చేశానని, 2017, 2018లో దేశంలో ఆలిండియా 723వ ర్యాంకు సాధించి ఐఆర్ఎస్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ జీఎస్‌టీ ఇంటలిజెంట్ అధికారిగా ఒరిస్సాలో విధులు నిర్వహిస్తున్నానని తెలిపారు. విద్యార్థులు ఉపాధ్యాయులు బోధించిన విషయాలను శ్రద్ధగా విని చదువులో రాణించినప్పుడే విజయాలు సాధించవచ్చని పేర్కొన్నారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని అన్నారు. టాలెంట్ అనేది ఎవరి సొత్తు కాదని టాలెంట్ ఉంటే ఏదైనా సాధించవచ్చని ఆయన అన్నారు. అనంతరం ఆయనను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఇల్తెపు శంకర్, ఉపాధ్యాయులు అబ్బయ్య, ఆనంద్, శ్రీనివాస్, లావణ్య, సుకృత, కలీం తదితరులు ఉన్నారు.



టీటీడీలో పూజలు నిర్వహిస్తున్న కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

శ్రీవారిని దర్శించుకున్న కామారెడ్డి ఎమ్మెల్యే

బీర్కూర్, మార్చి 1 : మండలంలోని తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో కొలువు దీరిన కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి వారిని శుక్రవారం కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి దర్శించుకున్నారు. శ్రీవారికి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి నందు పంతులు ఎమ్మెల్యేకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఇదిలా ఉండగా బీజేపీ పార్టీ మండల ఇంచార్జిసాయి కిరణ్ ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ఇంచార్జి సాయి కిరణ్, మండల ప్రధాన కార్యదర్శి పోచుగొండ, బీజేపీ నాయకులు లక్కపల్లి రాజు, నూకల రాము, యోగేష్, పండరీ తదితరులు ఉన్నారు.

'అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి'కి దరఖాస్తు గడువు పొడిగింపు

కామారెడ్డి రూరల్, మార్చి 1: విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించాలనుకునే పేద ఎస్సీ విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద ఆర్థిక సహాయం అందిస్తుందని జిల్లా షెడ్యూల్ కులాల అధికారి రజిత తెలిపారు. గతంలో ఇచ్చిన దరఖాస్తుల గడువు ఈనెల 31 వరకు పొడిగించబడిందని తెలిపారు. విద్యార్థులు డిగ్రీలో 60 శాతం మార్కులు పొంది ఉండాలని, కుటుంబం యొక్క సంవత్సరం ఆదాయం అన్ని విధాల రూ.3లక్షలకు మించరాదని తెలిపారు. ఈ పథకానికి ఆన్‌లైన్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. తెలంగాణ ఈపాస్.సీజీజీ.జీవోవి.ఇన్ ద్వారా నిర్ణిత ప్రోఫార్మాలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.



దామరంచ శివారులో ఉప కాలువ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

డిస్ట్రిబ్యూటరీ కాలువ మరమ్మతు పనులు ప్రారంభం

బీర్కూర్, మార్చి 1: మండలంలోని దామరంచ గ్రామ శివారు గుండా గల నిజాంసాగర్ 25వ డిస్ట్రిబ్యూటరీ కాలువ మరమ్మతు పనులను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ 25వ డిస్ట్రిబ్యూటరీ కాలువ ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగు నీరు సరఫరా కావడం లేదన్నారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ మేరకు అయకట్టు రైతులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు సాగునీటి సమస్య ను నియోజకవర్గ ఇంచార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లామని, ఆయన స్వయంగా కాలువను పరిశీలించారని అన్నారు.

హసన్‌పల్లిలో మైసమ్మ పండుగ

నిజాంసాగర్ (మహ్మద్‌నగర్), మార్చి 1: మహ్మద్‌నగర్ మండలంలోని హసన్‌పల్లి గ్రామంలో శుక్రవారం గ్రామస్థులు మైసమ్మ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రతీ ఇంటి నుంచి భక్తి శ్రద్ధలతో బోనాలు సమర్పించారు. మొక్కులు చెల్లించి, అమ్మవారు అందరిని చల్లంగా చూడాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

కామారెడ్డి టౌన్, మార్చి 1: డ్రంకెన్‌డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష పడినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఇటీవల పట్టణంలో డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహిస్తుండగా పట్టణానికి చెందిన సురేష్, ఏసుబాబులు మద్యం తాగి వాహనం నడపడంతో వారిని పట్టుకున్నట్లు తెలిపారు. శుక్రవారం కోర్టులో హాజరుపరచగా వారికి న్యాయమూర్తి ప్రతాప్ రెండు రోజుల జైలు శిక్ష విధించారని తెలిపారు. మద్యం తాగిన తర్వాత వాహనాలను నడపకూడదని, అలా నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

..పలువురికి జరిమానాలు

గాంధారి: మండలంలో మద్యం తాగి వాహనాలు నడిపిన పలువరిని శుక్రవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి జరిమానాలు విధించారని ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. ఆత్మారామ్, సాయిలు, శంకర్, గోవింద్, సాయిలులకు జరిమానాలు పడ్డాయని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్ష విధించబడుతుందని ఎస్ఐ తెలిపారు.

ఇద్దరు వ్యక్తుల అదృశ్యం

కామారెడ్డి ఆదర్శనగర్ కాలనీకి చెందిన పప్పుల నాగరాజు, రాజనగర్ కాలనీకి చెందిన కనకంటి స్వామి కనిపించకుండా పోయినట్లు సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఇరువురి కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నమని ఆయన తెలిపారు.

గర్భిణుల్లో రక్తహీనత సమస్య రాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కామారెడ్డి టౌన్, మార్చి 1: గర్భిణుల్లో రక్తహీనత సమస్య రాకుండా వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. శుక్రవారం ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణుల నమోదు క్రమం తప్పకుండా చేపట్టాలని తెలిపారు. రక్తహీనత సమస్యతో గర్భిణులకు సమస్యలు వస్తే వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకుంటానని తెలిపారు. గ్రామస్థాయిలో బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి మందులు అందించాలని కోరారు. రాష్ట్రీయ బాల సంరక్షణ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు పరీక్షలు చేసి ఆరోగ్య రికార్డులను నమోదు చేయాలని సూచించారు. ఈనెల 3 న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. 0-5 ఏళ్లలోపు పిల్లలందరికీ చుక్కల మందు వేయించి 100 శాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలని కోరారు. జూమ్ సమావేశంలో డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు శోభారాణి, చంద్రశేఖర్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రం పరిశీలన

కామారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణ తీరు, విద్యార్థుల హాజరు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో ఏర్పాటు చేసిన మౌలిక వసతులను పరిశీలించారు. పరీక్షలు పగడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి షేక్ సలాం, డీవోలు పాల్గొన్నారు.

పురాతన బావిని సందర్శించిన కలెక్టర్

రాజంపేట: రాజంపేట మండల కేంద్రంలోని శుక్రవారం ప్రాచీన కాలానికి చెందిన గడీల బావిని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పరిశీలించారు.



రాజంపేటలో గ్రామస్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాచీన కట్టడాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రాచీన కాలంలో నిర్మించిన బావి శిథిలావస్థకు చేరుకోవడంతో దానిని దాతల సహకారంతో బాగు చేయిస్తామన్నారు. పూడిక తీస్తే భూగర్భజలాలు ఈ ప్రాంతంలో పెరిగే అవకాశం ఉందని సూచించారు. శ్రమదానం చేయడానికి స్వచ్ఛంధ సంస్థ, మహిళ సంఘాల ప్రజాప్రతినిధులు దాతలు ముందుకు రావాలన్నారు. గ్రామ యువకులు, గ్రంథాలయం ఏర్పాటు కోసం దరఖాస్తు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను ప్రభుత్వం అమలు చేస్తోంది

జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు

నిజాంసాగర్, మార్చి 1: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అంచెలంచెలుగా అమలు చేస్తామని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు తెలిపారు. శుక్రవారం జుక్కల్ నియోజకవర్గంలోని నిజాంసాగర్, మహ్మద్‌నగర్ ఉమ్మడి మండలాల పరిధిలోని మహ్మద్‌నగర్ గ్రామంలో షాది ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కుల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే 8 మండలాలకు చెందిన 329 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీ పథకాలను ఇప్పటి వరకు నాలుగింటిని అమలు చేయడం జరిగిందని, మరో 2 గ్యారంటీలను అతి త్వరలో అమలు చేయడంతో పాటు రుణమాఫీని కూడా రైతులకు అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడమే కాకుండా సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులకు కార్యాచరణ రూపొందించిందని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఎన్నడూ కూడా నెరవేర్చకుండా ఉండదని, వాటిని నెరవేర్చాలనే సంకల్పంతో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ పేదల పార్టీ అని, ఎన్నడూ పేదలను విస్మరించదన్నారు. త్వరలో విద్యుత్ మాఫీ పథకం అమలు చేయడానికి ఇప్పటికే అధికార యంత్రాంగం కసరత్తు జరిపించిందన్నారు. విద్యా, వైద్య రవాణా రంగాలను అభివృద్ధి చేసేందుకు ముందుంటుందన్నారు. మహ్మద్‌నగర్, గున్కుల్ గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు జరిపారు. దళితులకు భూమి పంపిణీ చేస్తే మహ్మద్‌నగర్ గ్రామానికి చెందిన మాజీ చైర్మన్ తాను సొంతంగా భూమిని పంపిణీ చేసినట్లు చెప్పడం సరికాదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన భూమిని తాను ఎలా ఇచ్చానని చెప్పారన్నారు. అనంతరం నాగమడుగు ఎత్తిపోతల నిర్మాణ పనులను పరిశీలించారు. నియోజకవర్గంలోని 49 గ్రామాలకు 39 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు నిర్మించే పథకం త్వరిత గతిన పూర్తి చేయాలని ఆయన కాంట్రాక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో 8 మండలాల తహసీల్దార్లు, పార్టీ ప్రముఖులు, తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు

పలు విద్యా సంస్థల్లో మాక్ పోలింగ్

సదాశివనగర్, మార్చి 1: మండలంలోని మర్కల్ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మాక్ పోలింగ్ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ రాధిక తెలిపారు. నామినేషన్లు దాఖలు చేయడం, మోడల్ ఈవీఎం ద్వారా ఓటు వేయడం, ఓటుహక్కు వినియోగించుకోవడంపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రేణుక, అకాడమిక్ కో ఆర్డినేటర్ వనజ, కాలేజీ అంబాసిడర్ అనిత్ తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద: బిచ్కుందలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎస్వీఈఈపీ యాక్టివిటీలో భాగంగా మాక్ పోలింగ్ నిర్వహించినట్లు కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. కళాశాల విద్యార్థులకు బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు వేయడంపై అవగాహన కల్పించారు. ఓటర్లుగా, ఎన్నికల అధికారులుగా విద్యార్థులు వ్యవహరించారు. దీంతో కళాశాల అంతా ఎన్నికల వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో అకాడమిక్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, వెంకటేశం, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట: లింగంపేట మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం మాక్‌పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధన్యతను విద్యార్థులకు తెలియజేస్తూ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రంలో పీవో, ఏపీవోతో పాటు ఇతర సిబ్బంది ఓటు వేసే బాక్స్, ఓటరు జాబితాతో పాటు పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఓటరు గుర్తింపు కార్డును అందజేసి ఓటు హక్కును వినియోగించుకునేలా వారికి వివరించారు. అనంతరం మాక్‌పోలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శౌకత్‌అలీ, సిద్దిఖీ, గంగాధర్, ప్రదీప్, రమేష్, సిబ్బంది ఉన్నారు.



భిక్కనూరులో సంబరాలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ హామీ నెరవేరుస్తుంది

● ఎంపీపీ గాల్‌రెడ్డి

భిక్కనూరు, మార్చి 1: ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ హామీని రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చి తీరుతుందని ఎంపీపీ గాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం భిక్కనూరులో లబ్ధిదారులకు గృహజ్యోతి పథకంలో భాగంగా జీరో కరెంట్ బిల్లును అందించి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలను నిర్వహించారు. ఈ మేరకు ఎంపీపీ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తప్పకుండా నెరవేరుస్తుందని అందులో భాగంగానే గృహజ్యోతి పథకం కింద తెల్లరేషన్‌కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికి ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, పాల్గొన్నారు.

దోమకొండలో..

దోమకొండ: మండల కేంద్రంలోని అంగడిబజార్‌లో శుక్రవారం గృహజ్యోతి పథకంలో భాగంగా జీరో బిల్లు కార్యక్రమాన్ని ఏడీఈ కిరణ్ చైతన్య, జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందజేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, అట్టి పథకంలో భాగంగా గృహజ్యోతి కార్యక్రమాన్ని మార్చి నుంచి జీరో బిల్లుగా రావడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తీగల తిర్మల్ గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద, నాగరాజు, ఏఈ ప్రదీప్, ఎంపీవో తిరుపతిరెడ్డి, అనంత్‌రెడ్డి, సీతారాం మధు, విద్యుత్ అధికారులు శ్రీనివాస్, కిరణ్,తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలకు పరికరాలను అందిస్తున్న ఎస్‌బీఐ సిబ్బంది

బోధనోపకరణాల అందజేత

రాజంపేట, మార్చి 1: రాజంపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ప్రక్రియలో భాగంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పాఠశాల డిజిటలైజేషన్‌లో ఐదు లక్షల విలువైన డిజిటల్, బోధనోపకరణ సామగ్రి అందజేసినట్లు ఎంఈవో రామస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ సీహెచ్ రమణ ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ రాజశేఖర్ పాల్గొని పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలతకు సామగ్రి అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి శ్రీపతి, లక్ష్మీనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈశ్వరయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్‌బీఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహ్మద్‌నగర్ పాఠశాలలో ఫిజియోథెరపీ



నిజాంసాగర్ (మహ్మద్‌నగర్), మార్చి 1: మండల కేంద్రంలోని ప్రైమరీ పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ నిర్వహించారు. ప్రతిరోజూ తల్లిదండ్రులు వ్యాయామాలు చేయించాలని సూచించారు. 8 మంది విద్యార్థులకు ఫిజియోథెరపీ నిర్వహించినట్లు ఫిజియో థెరపిస్టు అరుణ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో సరిత

కస్తూర్బా పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ఎల్లారెడ్డి, మార్చి 1: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో శుక్రవారం ఉదయం విద్యార్థులకు సీడీపీవో సరిత ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

మద్నూర్, మార్చి 1: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు ప్రకాష్ తెలిపారు. భారీ సంఖ్యలో భక్తులు వచ్చి విజయవంతం చేయాలని కోరారు. వచ్చిన భక్తుల కోసం అన్నదానం, ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని సూచించారు.



మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీవో

'ఉపాధి హామీ'ని సద్వినియోగం చేసుకోవాలి

రామారెడ్డి, మార్చి 1: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రామారెడ్డి ఇంచార్జ్ ఎంపీడీవో సవిత తెలిపారు. రామారెడ్డి మండలం జగదాంబ తండా గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ ఉపాధి పనులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎలాంటి అక్రమాలకు పాల్పడకుండా విధుల ప్రకారం పనులను చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీవో ధర్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శి, పలు పార్టీల నాయకులు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.



కానిస్టేబుల్‌కు రివార్డును అందజేస్తున్న ఎస్పీ సింధూశర్మ

హత్య కేసును ఛేదించిన కానిస్టేబుల్‌కు రివార్డు

లింగంపేట, మార్చి 1: లింగంపేట మండలంలోని శెట్పల్లి సంగారెడ్డిలో గత సంవత్సరం అక్టోబరు 9న జరిగిన హత్య కేసును ఇటీవల ఛేదించి నిందితున్ని పట్టుకున్న కానిస్టేబుల్ రాజుకు ఎస్పీ సింధూశర్మ రివార్డును అందజేసి అభినందించారు. ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలు పార్కాల కమలమ్మ ఇంట్లోకి అదే గ్రామానికి చెందిన జీవన్ అలియాస్ రాజు అర్ధరాత్రి చొరబడి వృద్ధురాలిని హత్య చేసి ఆమె వద్ద ఉన్న బంగారం దోచుకుపోయాడు. హత్య కేసును నమోదు చేసుకుని పోలీసులు విచారణ జరుపుతున్నారు. అప్పటి నుంచి నిందితుడు కనిపించకుండా పోయాడు. లింగంపేట పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ రాజు గ్రామంలో విచారణ జరిపి అతని కోసం గాలించి పట్టుకుని ఉన్నతాధికారులకు సమాచారం అందించి నిందితున్ని ఈనెల 10న రిమాండ్‌కు తరలించారు. హత్య కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టేబుల్ రాజుకు, డీఎస్పీ శ్రీనివాస్‌కు, ఎస్సై చైతన్యకుమార్‌లను అభినందించారు.

కన్నుల పండువగా సంతోషి మాత ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మద్నూర్, మార్చి 1: మండల కేంద్రంలోని సంతోషి మాత ఆలయ వార్షికోత్సవం కన్నుల పండువగా జరిగింది. మూడు రాష్ట్రాల భక్తులు తరలివచ్చారు. తెల్లవారు జాము నుంచే ఆలయానికి చేరుకున్న భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రతీ ఏడాది మహా శివరాత్రికి ముందు శుక్రవారం ఆలయ వార్షికోత్సవం నిర్వహిస్తారు. ఆలయ నిర్వాహకురాలు సంతోషి యజ్ఞ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా రాష్ట్రీయ సాధు సంరక్షణ సమితి అధ్యక్షుడు కళ్యాణానంద స్వామిజీ భక్తులనుద్దేశించి మాట్లాడారు. కుంకుమార్చన పూర్తికాగానే యజ్ఞ కార్యక్రమం ప్రారంభించారు. సాయంత్రం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కళ్యాణానంద స్వామిజీ మాట్లాడుతూ భారత దేశంలో సంస్కృతి, సాంప్రదాయం గొప్పదని, ఆలయాలను దర్శించుకుని భక్తులు కోరిన కోర్కెలు తీర్చుకుంటారని గుర్తు చేశారు. నేటి యువత పాశ్చాత్య సంస్కృతిని అవలంబించి భారత సంస్కృతిని మరిచిపోతుందని, తల్లిదండ్రులు, సంస్కృతి, సాంప్రదాయాలను గుర్తు చేయాలన్నారు. ఆలయాలకు తీసుకెళ్లి ఆలయ విశిష్టతను తెలియ జేయాలని గుర్తు చేశారు. జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా సంస్కృతి, సాంప్రదాయాల విలువలు గుర్తిస్తే వాటిని దూరం చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమానికి ఆయా రాష్ట్రాలు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులురావడంతో ఆలయం కిటకిటలాడింది.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

దర్శన్ - హనుమాన్
శాంతి - ఊరు పేరు భైరవకొన
ప్రియా 70 - ఈగల్
ప్రియా 35 - ఆపరేషన్ వాలెంటైన్

బాన్సువాడ

మహేశ్వరి - గుడాచారి 111
వెంకటేశ్వర - ఆపరేషన్ వాలెంటైన్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

